# కథ

# చిలకలు వాలిన చెట్టు

జి.వెంకటకృష్ణ

అడవి సముద్రంలా పొటెత్తే దినాలలో గృహస్థు జంట ఏదో చెప్పలేని అలజడినీ వుద్విగ్నాన్నాన్నీ మోసేది. ఒక ఫోటోగ్రాఫర్ దాన్ని చిత్రించి చిలువలు పలవులుగా అభివర్ణిస్తుంటే ఆ జంటతో పాటు మేమూ అతన్ని సంబరంగా చూసేవాళ్ళము. ఆ ఫోటోగ్రాఫరంటే నాకు చచ్చేంత ప్రేమ. అతని దృక్కోణాలు కొత్త చిత్రాలని చూపేవి. ఉగ్రూతలూగించేవి. ఆ ఫోటోగ్రాఫర్ తెలుగు నేలను సముద్రమ్మీద కల్లోల భరిత కెరటాల మీద తెలియాడుతున్న నావలా వర్ణించేవాడు. రాలిపడుతున్న శిరస్సులు సమాజ కర్కశ దాహాన్నీ తీరుస్తున్న వీధి కోలాయిల్లా వర్ణించేవాడు. మా గంభీరం మూర్తీభవించిన సావాసగాడు గుంభనంగా నవ్వుతూ, అప్పుడో మాట, అప్పుడో మాట ఆచీ తూచీ వదిలేవాడు. దేని గురించైనా తన తీర్పు చాలా విలక్షణంగా వుండేది. కొమ్మ మీద వాలినప్పుడు నిలబడ్డానికి తోకనూ, రెక్కలనూ పదే పదే వూసే పక్షిలా నా మిత్రుడు సమన్వయం చేసుకునే ముందు తెగ గుంజుకునేవాడు.

నాకలాంటి దిగులులేదు. దాని పట్ల శ్రద్ధాలేదు. నచ్చిందా నా నోట కిచకిచలే, అయినా అనుభూతిని దాచుకునే అవసరం ఏముంది. అయితే కాలమంతా కేరింతతోనే గడవలేదు.

ఆ చెట్టుతో మాస్నేహం ఎలాంటి ఫిర్యాదులు లేందీకాదు. ఎన్ని ఫిర్యాదులైనా చెయ్యొచ్చు ఆ జంటపై. ఆ మగశాఖలు అప్పుడప్పుడూ మమ్మల్ని ఏదో అనుమానంగా చూసేవి. అసహనంగానూ పలకరించేవి. పక్షిగా ఎపుడు మారతాడో, చెట్టుగా ఎపుడు వుంటాడో అర్థమయ్యేదికాదు. పచ్చని చెట్టుకదా అని వాలినపుడు వున్నదున్నట్టుగా గద్దగా మారి, మమ్మల్ని తరిమే గుణమూ, మమ్మల్ని వెంటాడే తనమూ వుండేది. అయితే అంతలోనే పూర్వపు రూపంలోకి మారి చల్లని నీడై కొమ్మలా చేరదీసేవాడు. నచ్చని అభిప్రాయాలు చెప్పినప్పుడు గదమాయించే ఆ కొమ్మ విపరీతంగా వూగిపోయేది.

**మొదటి చిలక చెప్పిన కథ :**

అదొక చెట్టు. స్త్రీ పురుష ఆత్మలు పెనవేసుకొని, భౌతికంగా ఒక కుటుంబంలా, ఆత్మికంగా ఒక సమూహంలా, తనకు తాను ఒక అడవిలా ఎదిగిన చెట్టు. ఒక్కోసారి అది నాలుగ్గోడల గదిగానూ, ధిక్కార మేఘాలు గర్జించిన అడవిగానూ, కల్లోల కెరలాట మీద ప్రయాణిస్తున్న నావగానూ, ఎగిసిపడే కెరటాల సముద్రంగానూ, యిసుక తుఫానులు చెలరేగే ఎడారిగానూ మారిపోతుంటుంది.

పుస్తకాలు చదివిన సంస్కారంతోనూ, మానవ సంబంధాల చర్చలతోనూ, మానవ అస్తిత్వం పట్ల ఆవేదనతోనూ, మనిషిలోపల విధ్వంస మవుతున్న విలువల పట్ల వగపుతోనూ, ఆ ఇంటి గోడలు ఎప్పుడూ గలగల మంటుంటాయి. ఆ చెట్టు కొమ్మలు. పూచే పూల మేధోసంపత్తితో గుబాళిస్తుంటాయి. ఒక మాటలో చెప్పాలంటే ఆ చెట్టు తెలుగునేలంత కల్లోల భరితంగా వుంటుంది. ఆ యిల్లు తెలుగు మధ్య తరగతి రాజకీయ కుటుంబంలా వుంటుంది.

రాలే ఆకులు అద్భుత వర్ణచిత్రాలుగానూ, చిగురించే ఆకులు నునులేత చెక్కిళ్ళ కన్నెపిల్లలు గుబ్బెమ్మల చుట్టూ చేరి పాడే పాటలా మానవోత్తేజంగానూ, ఆ కొమ్మలు వూగుతుంటే ఏ రాయలసీమ పల్లెలో ఆడే కోలాటం కర్రల శబ్దాల్లానూ, ప్రజా గాయకుల వదనర్తనలానూ, ప్రత్యామ్నాయ మార్గాలు వెతికే ప్రయత్నంగానూ వుంటుంది.

అద్భుతమైన కాలకెరటాల మీద అడవి విన్యాసాలు చేస్తున్న కాలాన, ఆకుపచ్చని నీడల చాటున ఎర్రెర్రని ఛాయలు అంతటా చల్లని గాలిలా పరుచుకుంటున్న కాలాన మేము కొందరం మానవ పక్షులమై జంటలు జంటలుగా ఆ ఇంటి నీడన విశ్రమించాము. ఆడాము, పాడాము, వుత్తేజం పొందాము. కొన్ని క్షణాలపాటు యుద్ధరంగ వీరులమయ్యాము, అంతలోనే చప్పున పగిలే బుడగలమయ్యాము. మరెన్నో పక్షులు మా విన్యాసాలనూ, మా స్నేహాన్నీ, పంతాన్నీ, వగవునూ, అక్కసునూ, నాటకరంగమ్మీది పాత్రల్లా చూశాయి, అనుభవించాయి.

నేను మొదటిసారిగా నా ఎదిగీ ఎదగని రెక్కలతో ఆ చెట్టును వాలినప్పుడు, ఆ చెట్టు మీది పక్షిపిల్లలతో ఒకడిగా కలిసిపోయాను. నిజానికి పెద్దలకంటే పిల్లలతోనే నా అనుబంధం. నా బిడియమో, నా వెనుకబాటు తనమో, మరేదో నన్ను మనుషుల కళ్ళలోకి సూటిగా చూడలేని తనమై ఎదుటి మనిషితో మాట్లాడుతూ పక్కనున్న పిల్లలతో ఆడుకునేవాడిని. ఆ యింటికి నేనెపుడూ నా సావాసగాడితో పాటే వెళ్ళేవాడిని. వాడు మూర్తీభవించిన గంభీర హృదయుడు, అతి నింపాదిగా తన అభిప్రాయాన్ని చెప్పె ఆచీ తూచీ మనిషి. ఎంత స్థిరంగా కనబడతాడో అంత చంచల. ఆ గృహస్థు జంటతో మా స్నేహం ఎన్నో హద్దుల్ని దాటిపోయింది. ఎన్నో దూరాల్ని చేరుకుంది. ఆ చెట్టే మాదైంది. మా కిలకిల రావాలతో తప్ప వాళ్ళకు పొద్దుగడవని కాలమైంది. సోమర్‌సెట్ మామ్ కాఫ్కా నెథానియేల్, మార్క్వెజ్, నెరుడా సార్త్ర లాంటి పాశ్చాత్య మేధావుల్నుంచీ, తెలుగులో రాజయ్యా రఘోత్తం కేశవరెడ్డి రంగనాయమ్మల దాకా అందరిపైనా మా అభిప్రాయాల చిలకపలుకులు వ్యక్తీకరించేదాకా ఏ రాత్రీ మాకు నిద్రలేదు.

వేము నిలబడలేనంతగా. అంతలోనే ఆడపక్షి తల్లిలా తన రెమ్మల చాటున దాచిన ఫలాలను మాకందించేది. పెనిమిటిని శాంతపరిచేది. మమ్మల్ని మళ్ళీ మళ్ళీ ఆ చెట్టు మీద వాలేలా చేసేది. ఆ చెట్టు పురుషత్వానికి యీమె స్త్రైణ్యం తోడులేకుంటే ఆ చెట్టు మోడుచెట్టులా మారిపోయుండేది. మనిషినైనా, చెట్లనైనా కాపాడేది స్త్రీలేనని వాళ్ళను చూసే నాకర్థమయ్యింది.

నా కాలమంతా నేను అనుకున్నట్టుగానే జరగలేదు. నా కథ నేను, చెప్పుకునే దినం వస్తుందనీ నేననుకోలేదు. ఆ చెట్టు మీది పక్షులతో నా అనుబంధం తెంచుకునేది ముందు నేనేననీ నాకర్థం అవలేదు. మా జీవితాల్లో ఎన్నోకల్లోలాలు, అడివి సముద్రంలోనూ, నాగుండె సముద్రంలోనూ ఎన్నో తుఫాన్లు. నాలో చెలరేగిన తుఫాన్లు, తీరం దాటకుండా చేసిన విధ్వంసాన్ని మీకు చెప్పలేను. అన్నీ నా సహచరునికి మూర్తీభవించిన గంభీరానికి తెలుసు. మనిషైనా, పక్షైనా అంతమై పోవడానికి స్త్రీయే కారణమని నాకర్థమైపోయింది. నేను కన్న రంగుల కలలూ, నా పొదరిండ్లలో నేను అల్లిన అందమైన గూళ్ళూ ఎందరు చూశారు? యీ కాంక్రీట్ వనాల నుండీ పిల్లల్ని పొదరిండ్లలో ప్రకృతిలా పెంచాలని ఎంత ప్రయత్నం చేశానో ఎంతమంది అర్థం చేసుకుంటారు. ఎందరు అర్థం చేసుకోలేకపోయినా, నేను మెచ్చిన పక్షి అర్థం చేసుకోలేదే, నా వెంట జంటగా నడుస్తానన్న వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదే, నాతో చేసిన కువకువలూ సరాగాలూ, సహప్రయాణాలు అన్నీ వమ్మయ్యాయే.

ఆ నిరాశలో నాలో వెలుగు నింపే ఏ చెట్టూ అడవి నుండీ రాలేదు సముద్రాన్నీ మధించే అడవి నాలో ఏ విశ్వాసాన్నీ నింపలేదే, నా ప్రేమరాహిత్యం ముందు ఏ తాత్వికతైనా వెలవెల బోయిందే, అవమానంతో దహించుకుపోయి వడలి రాలిపోవడానికి సిద్ధమైన ఎండుటాకులా నా జీవితం ఆ చెట్టు కొమ్మలకే వేలాడి రాలిపడింది. అదే నాకు విముక్తి. నాకు జరిగిన పరాభవాలకు యీ దుష్ట సమాజాన్ని ధిక్కరిస్తున్నాను. నిజం, నమ్మండి ఇది నా ధిక్కారం!

**రెండవ చిలక చెప్పిన కథ :**

ఈ చెట్టు ఎంతో నర్మగర్భమైంది ఆనవ్వు వెనుక ఎన్నో అర్థాలు దాగుండేవి. వాస్తవానికిది గొప్ప తపస్సు చేసిన చెట్టే. రూపాంతరం చెందలేక యిలా మిగిలిపోయింది. సగం చెట్టు, సగం పక్షి, మానవ హృదయం. అది శాపమైనా కావచ్చు వరమైనా కావచ్చు వగపులేని స్థితి. ఆ చెట్టుకొమ్మల్లో లిఖించిన ఎన్నో శాశనాలను చదివాను. ఆ చెట్టుకొమ్మల్లో నిక్షిప్తమైన ఎన్నో అద్భుతమైన అనుభూతుల్ని చవిచూశాను. ఆ చెట్టు తనకు తానుగా కట్టుకున్న పంజరాలను చూశాను. ఏ అవగ్రాతో ఆ చెట్టు వున్నదున్నట్టుగా పంజరంలో యిరుక్కుని శ్వాస ఎగబీలుస్తుంటుంది. ఆడ కొమ్మలు ఎంత అనునయిస్తున్నా, తెగ అనహానం ప్రదర్శిస్తుంటుంది. ఎంతో జ్ఞానవంతమైన ఆ శాఖ వున్నదున్నట్టుగా అంతే నిరంకుశంగా మారిపోతుంటుంది. అడ్డదిడ్డమైన తన తీర్పుల్ని మనల్ని శిరసావహించమని శాశిన్తూ వుంటుంది. అలా అని దూరం చేయకుండా, అక్కున చేర్చుకుంటూ వుంటుంది. ఈ మగకొమ్మల ఆలంబనకు అతని సహచరే కారణం. ఆమె లేకుంటే ఈ చెట్టు మోడు బారిపోయుండేది. ఏ పక్షీ వాలని చెట్టయ్యిండేది. జ్ఞానంతో వొరిగిపోయిన చెట్టు, ఒక్కోసారి వుబ్బస రోగిలా పార్కిన్‌సన్ వ్యాధిగ్రస్థిలా నేలవాలిపోతుందా అనిపించేది. నా ఫోటోగ్రాఫర్ మిత్రుడు ఆ దృశ్యాల్ని ఎన్నోసార్లు చిత్రించాడు కూడా. పడిలేచే కెరటంలా ఆ చెట్టూ, అద్భుత విన్యాసాలతో దాని మీద వాలిని పక్షులూ, తిరిగి నిలబడేవి. విన్యాసాలు చూసేవి.

అది చిలకలు వాలిన చెట్టు, చిలకలు చెట్టుగా మారామో, చెట్టే అప్పుడప్పుడూ తన కొమ్మల్ని చిలకలుగా మార్చి పలకరిస్తుందోగానీ, మేము సాహచర్యం చేసింది అడవి చెట్టులాంటి చెట్టుతోనే, అడవి పక్షిలాంటి త్యాగమూ వీరత్వమూ నిండిన ఆత్మతోనే. అయితే అది నిత్య చంచల. అచంచలత్వాన్ని ప్రశ్నించిన ఫోటోగ్రాఫర్‌తో పాటు యిది భాగమైపోయినపుడు ఎన్నో స్వయంప్రకటిత సందేహాలను గుప్పించిందీ చెట్టు, అడవి సముద్రాన్ని దాటలేదనీ, సముద్రం అడవిలా నరికేయ బడుతుందనీ జోస్యాలు చెప్పింది. నావలు చీలిపోతున్న కాలాన ఎవడు చెప్పింది వాడికి వేదమేకదా, అందుకే మేము ప్రేక్షకులమై, సముద్రాన్నీ అడవినీ వేరు వేరుగా చూస్తూ ఆ చెట్టుకొమ్మల్లో నిలబడ్డాము.

ఆ నిలకడ ఎంతో కాలం సాగలేదు. ఒక ప్రేమరాహిత్య లైలా తుఫానులో నా సహచర మిత్రుడు అతి చల్లనివాడు, నిర్మలమైనవాడు నాతోపాటు ఆ అడవినీ, సముద్రాన్నీ ప్రేమించేవాడు బయల్దేరి ఎక్కడో వేలాడిపోయాడు. కారణం చెట్టుకు తెలుసు కారణాలు స్త్రీలకు తెలుసు. రోజుకో మాట మార్చే అతి చంచలలకు తెలుసు కాలం కొమ్మకు వేలాడ్డం ఎంత భయానకమో ఎంత ధిక్కారమో, ప్రేమలో అమృత హస్తమున్నట్లే, స్నేహంలో అనురాగమున్నట్లే, ఒక భస్మాసుర హస్తమూ, ఆధిపత్యమూ వుంటుందని నా మిత్రుడికి తెలిసొచ్చే కాలానికి, అతను కన్న కలల లిల్లీపూవుల్ని గొంగళిపురుగులు కొరికేసాయి. కాంక్రీట్ వనపు కఠిన సీలింగ్ ప్రేమలు అతన్ని వేలాడదీశాయి.

ఆ దృశ్యాల్ని చూసి చిలుకలు వాలిన చెట్టు నిలువునా కదలిపోయింది. వేలాడిన పక్షి ఆత్మన్యూనతకు తానూ దోహదం చేసానుకదా అని వగచి వలవల ఏడ్చింది. తన చేతుల్లో పకపకలాడిన పూవులు, యిలా పేలవమై వేలాడతాయని వూహించలేక భోరుమంది. కాలం తీర్పుముందు ఆ చెట్టుదీ యింత దోషముంది. ఆ చెట్టును ప్రేమించిన చిలకను అర్థం చేసుకోవడంలో ఆధిపత్యాన్ని ప్రదర్శించానన్న ఆత్మవిమర్శ ఆ చెట్టు చేసుకుందా? నా కనుమానముంది. ఎన్ని వేల విశ్లేషణలు చేస్తే మాత్రం యీ చెట్టుతో అనుబంధం మాకు విడదీయనిది. ఎన్ని విషాదాలు జరిగితే మాత్రం ఆ చెట్టు తిరిగి తిరిగి తన చల్లని కొమ్మల్ని పరుస్తూనే వుంది. వేలాడి మాయమైన పక్షికి స్మృతిశాసనాన్ని లిఖించింది. చెట్టు ఎన్నో పక్షుల్ని పిలిచి అక్షరాలతో అంజలి ఘటించింది.

**మూడో చిలుక చెప్పిన కథ :**

మొదట్లో నేను, యిది మూసల్ని మోసే చెట్టనుకున్నాను. వొకప్పుడు నేనూ మూసలో కార్యకర్తనే, అట్లని యిప్పటికీ అది తీరని అనుమానమే. నాకిది మేధావి చెట్టు. అందరూ ఆలోచించేదాని కన్నా భిన్నంగా ఆలోచిస్తుందనీ, ప్రత్యామ్నాయ మార్గాలు

వెతుకుతుందనీ వొక గౌరవం. సాధారణమైన తీర్పుల్లో అతి సాధారణమైన తప్పుల్ని పట్టి చూపుతుందీ చెట్టు. నా విషయంలో అది చేసిన న్యాయమే నేను దగ్గరయ్యేందుకు కారణమైంది. నేను యీ యింటిపై వాలే కాలానికి వ్యక్తిగతమైన ప్రేమవివాహ సంబంధాల్లో చిక్కులు ఎదుర్కుంటూ వున్నాను. ఆ చిక్కుల్ని యీ పక్షి చెట్టు తన ముక్కుతో అతి సులువుగా విప్పేసింది. నా అలసిన గుండెలకు ఎంతో భరోసానిచ్చింది. నా నిర్ణయాన్ని బలపరిచింది. నా వెంట దృఢంగా నిలబడింది. యీ లోకంలో ఎవ్వరూ యివ్వనంత నైతిక బలాన్నిచ్చింది. ఈ చెట్టు కొందరి మాటల్లో "ఒక తిక్కది". అయితే ఆ తిక్కలో ఒక పక్షపాతముంది దానికి కారణం, న్యాయంలో అన్యాయాన్నీ, అన్యాయంలో న్యాయాన్నీ వేరుపరచే హంస స్వభావం. ఈ చెట్టుకు ఆధిపత్యముంది. ఆ ఆధిపత్యంలో నన్ను ప్రేమించింది. నాకు ప్రేమా ఆదరణా అవసరమైన కాలాన అది ఎంతో ఆనందాన్నిచ్చింది. ఆ అవసరం తీరిపోయాక, పక్షులు యీ చెట్టునుండీ ఎగిరిపోతాయని నాకెన్నో సార్లు అర్థమైంది.

నేను ఆ కొమ్మల మీద సేదదీరే కాలాన మూర్తీభవించిన గంభీరహృదయుడైన ఒక మిత్రుడు, మధ్యతరగతి కుటుంబపు గదిలా మారిన ఆ కొమ్మల్లో చాలా చింతాకాంతుడై శోకగీతాలు పాడేవాడు, అతనితో పాటు చాలామంది ఒక వేలాడిన పక్షి గురించి లేదా అలాంటి పక్షుల్ని గురించి పాటలు పాడేవాళ్ళు. వీళ్ళు ఎక్కువ భాగం యీ పనుల్లోనే వుంటారా అనిపించేది. వీళ్ళు నమ్మే సముద్రమ్మీది అడవి ఆచరణ దీనికి అనుగుణంగానే వుండేది. శోకగీతాల తర్వాత వీరత్వ గీతాలూ పాడేవాళ్ళు వొక్కోసారి రెండూ జమిలిగానూ. యీ చెట్టు ఆ గానాభజానాలకు వేదికయ్యేది. ఆరోజుల్లో యిది మార్మోగిపోయేది. ఎన్నో విశ్లేషణలు చేసేది.

ఈ చెట్టుకు ప్రతి దానికీ పుల్లలు ఎట్టే గుణముంది. నచ్చకపోతే కొమ్మలతో చళ్ళుమని వీపుల మీద చరిచే గుణముంది. "సరిగా పాడు, యిది అవగాహనతో పాడింది కాదు" అనే శాశించే గుణం. కొన్ని చిన్నబుచ్చుకునేవి, కొన్ని కొత్తగా తప్పులు దిద్దుకునేవి ఏమైనా అన్నీ యీ చెట్టును ప్రేమించేవి. చెట్టూ ఒక ఆధిపత్యంతో పక్షుల్ని అక్కు చేర్చుకునేది.


సముద్రం అడవిలో అల్లకల్లోలమయ్యే కాలానికి, ఎడారి తీరంతో యిసుకతుఫానులను చెట్లనిండా కప్పేసే కాలానికి, ఒక తుఫాను చేతిలో చిక్కి ప్రశ్నించబడి, బెదిరింబడీ మూర్తీభవించిన గంభీర హృదయుడు మాయమైపోయాడు. ఆ గాలికి ఎగిరి ఎక్కడ పడ్డాడో మేమంతా వెతుకుతూనే వున్నాము. నిజంగా అంత బలం లేని వాడా, కాదే, అంత సులభంగా ఎలా ఆ గాలిలో ఎగిరిపోయాడో అర్థం కాకుండా వుంది. అతను యిక్కడ నిర్మిస్తానని వాగ్దానం చేసిన గూడు యింకా పూర్తీ కాలేదు. మధ్యలో వదలి వెళ్ళిన నిర్మాణం యిప్పుడు శిథిలంగా వుంది. అన్నింటికీ సాక్షిగా తెలుగు మధ్యతరగతి కుటుంబపు నాలుగు గోడల గదిగా మారిపోయిన చెట్టు శాంత గంభీరంగా వుంది. ఎగిరిపోయిన పక్షి భోగట్టా దీనికి తెలుసు అలా ఎగిరిపోయిన పక్షుల్నీ ప్రేమించాల్సిందే యీ చెట్టు. అలా అని పక్షుల్ని కాపాడుకునే శక్తి యీ చెట్టుకు లేదని నాకు తెలిసిపోయింది.

కళ తప్పుతున్న అడవిలో కల్లోలమవుతున్న సముద్రంలో శవాలవుతున్న సరంగుల్ని చూస్తూ విశ్వాసం కోల్పోతున్నది చెట్టు. వున్నది వున్నట్టుగా చెప్పాలంటే యీ చెట్టే యిప్పుడు కళ తప్పింది. గదుల్లా మారిన కొమ్మలపై వాలే చిలకలు కరువయ్యాయి. విలుకాడి గురికి దెబ్బమీద దెబ్బతింటున్న పక్షిలా, కాలం శౌర్యంతో జరిపే హననానికి సొమ్మసిల్లింది చెట్టు. ఆ కాలిన కొమ్మలూ, కూలిన గోడలు ఏ చిలకల్నీ ఆహ్వానించలేక పోతున్నాయి. ఆ చిలకలు వాలిన చెట్టు ఎంత నిర్దయగా కొన్ని పక్షులకు వాకిళ్ళు మూసేసిందో ఎంత నిర్లక్ష్యం చేసిందో మరిచిపోని పక్షులు అటువైపు వెళ్ళడమూ మానేసాయి. సముద్రంలో అడవి చల్లబడ్డాక, మైదానంలో వుత్సాహం క్రియా శూన్యమయ్యాక యిట్లాంటి చిలకలు వాలిన చెట్లు యిలాగే నిస్తేజమవుతాయేమో, లేదా వేరే రహస్య వృక్షాలను వెదుకుతూ గూడు చెదరిన పక్షులు చేరుతాయేమో నాకంతగా తెలియదు గానీ, నిర్మాణాల్ని కలగనే పక్షులు కొత్త స్థావరాల్ని కనుగొనకుండా వుంటాయా!

ఒకప్పుడు ఎంతో కోలాహలంగా, ఎన్నో విషయాలకు కూడలిలా వెలిగిన చెట్టు, ఒక జ్ఞానవంతమైన ఆ యిల్లు, మోదుగుపూలతో సముద్రం మీది అడవి కలకలలాడినప్పుడు, ఆ ఎర్రని ధగధగలను తన గోడలలో మెరుపులు మెరిపించిన, చెట్టు తన ప్రియ ఫోటోగ్రాఫర్‌తో వాటిని శాశ్వత జ్ఞాపకాలుగా చేసుకున్న ఇల్లు, తన వసంతం వలస వెల్లడం చూస్తుంది.

యిప్పుడా చెట్టుకు పక్షులు వాలాలనీ లేదు యిప్పుడా పక్షులకు ఆ ఇంట్లో ఆశ్రయం పొందాలనీ లేదు.

సప్తవర్ణాలనూ, సమస్త సాహసాలనూ, అద్భుత త్యాగాలనూ నిక్షిప్తం చేసుకున్న చెట్టును గర్భాన మోస్తున్న కాలం, కొత్త చిలకలు వాలే కొత్త చెట్లను కలగంటున్నది.



కోకిలమ్ సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో డా॥ఎ.ఎస్.రావు నగర్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రాంగణంలో ఆగష్టు 28న జరిగిన సభలో పులిగడ్డ విశ్వనాథరావు రచించిన హాస్యరచనల సంపుటి "తాడూ-బొంగరం"ను సుప్రసిద్ధ కవి డా॥అద్దేపల్లి రామమోహనరావు ఆవిష్కరించారు. చిత్రంలో సభాధ్యక్షులు కథారుషి మునిపల్లె రాజు, ప్రముఖ రచయిత్రి డా॥ముక్తేవి భారతి, పులిగడ్డ విశ్వనాథరావు ఉన్నారు.